పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



మహిళలకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల: పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం సంజామల మండల కేంద్రంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి, సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గత ప్రభుత్వంలో లాగా దళారీల ప్రమేయం లేకుండా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేస్తుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రజలకు తెలిపారు. అర్హులై ఉండి ఏదైనా కారణంతో పథకాలు అందని వారు ఉంటే సచివాలయాల్లో కానీ, వలంటీర్లకు కానీ మరోసారి ధ్రువపత్రాలు అందజేసి దరఖాస్తు చేయించుకోవాలని సూచించారు. పరిశీలించి కచ్చితంగా పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, కర్నూలు ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్నబాబు, సర్పంచ్ మదార్‌సా, తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎంపీడీఓ నాగకుమార్, కోవెలకుంట్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నాగర్జునరెడ్డి, మాజీ సర్పంచ్ పోచా వెంకటరామిరెడ్డి, ఎగ్గొని సర్పంచ్ అసద్ అల్లిఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో పార్టీలో చేరుతున్న పేరుసోమల గ్రామస్తులు

మండలం పరిధిలోని పేరుసోముల గ్రామానికి చెందిన 50 కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన రామాంజనేయులు, చింతమాను పెద్దన్న, జగదీశ్వరయ్య, కంబగిరి, రామేశ్వర్ రెడ్డి, సోమేశ్వర్ రెడ్డి, సుమన్, రామ్, దస్తగిరి, సుధాకర్, విజయ్, పుల్లయ్య తదితరులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు నచ్చి పార్టీలోకి చేరుతున్నామన్నారు. కాగా పార్టీ బలోపేతానికి పని చేసిన వారికి వైఎస్సార్‌సీపీలో గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే రామిరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

రైతు సంక్షేమానికి పెద్దపీట



రైతులకు మోటర్లు, స్టాటర్ బాక్స్‌లను అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. వైఎస్సార్ జలకల కింద బోర్లు వేసుకున్న నలుగురు రైతులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన మోటార్లు, స్టాటర్ బాక్స్‌లను సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏపీడీ శ్రీవిద్య, ఎంపీడీఓ వెంగన్నతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగవెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైఎస్సార్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు దొనపాటి యాగంటిరెడ్డి తన సొంత నిధులతో ఇద్దరు వికలాంగులకు ట్రైసైకిళ్లను అందజేశారు. సోమవారం ఆయన తన స్వగృహం వద్ద వికలాంగులు ఎస్సీ కాలనీకి చెందిన అచ్చమ్మ, పసుపల రాముడుకి ట్రైసైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, బనగానపల్లె మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

మండలానికి 20 వేల పాఠ్యపుస్తకాలు

కొలిమిగుండ్ల: 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే సెమిస్టర్-2 కు సంబంధించిన మండలానికి 20 వేల పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ రాజయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ త్వరలో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుని నాలుగు ఎండీయూ వాహనాల్లో పాఠశాలలకు చేరవేస్తామన్నారు.

ఆర్థిక సాయం

బేతంచెర్ల: పట్టణానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు బికారి (చిన్నోడు) ప్రమాదవశాత్తూ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా పూర్తిగా కోలుకోలేదు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు వెంకటేశ్వర్లు, రషీద్, నూర్‌అహ్మద్, బాలయ్య తదితరులు సోమవారం రూ.60 వేలు విరాళంగా అందజేశారు.

నేడు కోవెలకుంట్లలో జగనన్న సురక్ష

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని 2వ గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం జగనన్న సురక్ష సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాధిక తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉండి పథకాలు అందని కుటుంబాలను గుర్తించడమే సదస్సు ఉద్దేశమన్నారు. అలాగే 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు.

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామ సచివాలయ ఆవరణంలో మంగళవారం జగనన్న సురక్ష సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందనివారు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులో మార్పు తదితర 11 రకాల సేవలను సదస్సులో అందజేస్తామన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు

కొలిమిగుండ్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సీసీ రోడ్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవతో రామ్‌కో సిమెంట్ యాజమాన్యం ముందుకొచ్చింది. సీఎస్‌ఆర్ నిధులతో రోడ్డు నిర్మించేందుకు ఈనెల 20 నుంచి పనులు ప్రారంభించేందుకు రామ్‌కో ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ప్రధాన సీసీ రోడ్డుపై డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

డోన్: డోన్ పట్టణంలోని నీటి సమస్య పరిష్కారానికి ట్యాంకర్ల ద్వారా పరిష్కారం చూపుతామని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ డోన్ – వెంకటాపురం డబుల్‌లైన్ రోడ్లను ఫోర్‌లైన్ రోడ్లుగా మారుస్తున్నందువల్ల పైపులైన్లను కూడా మార్చాల్సి వచ్చిందన్నారు. దీనికితోడు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి వచ్చిన పైపులైన్ వరుసగా రెండో రోజు కూడా లీకేజీ కావడంతో ఐదు రోజులుగా తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిందని, ఇందుకు చింతిస్తున్నామన్నారు. ట్యాంకర్ల ద్వారా పట్టణ వాసులందరికీ తాగునీటిని అందించే ఏర్పాట్లు చేశామన్నారు.

వర్షం కోసం పూజలు



జలాభిషేకం చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: వరుణుడు కరుణించాలని పట్టణ వాసులు సోమవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెహ్రూనగర్‌లో వెలసిన మల్లికార్జునస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లోని శివలింగాలకు జలాభిషేకాలు చేశారు.

క్షయపై అవగాహన

డోన్: క్షయ, టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అన్ని రకాల వైద్యసేవలతో పాటు ప్రతినెలా ఆర్థిక సాయం అందజేస్తోందని రోకలబండ సత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు షాబాజ్ హుసేన్ తెలిపారు. స్థానిక సబ్‌జైల్‌లో సూపరింటెండెంట్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రిమాండ్ ఖైదీలకు క్షయ, టీబీ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులు వ్యాప్తిచెందే విధానంపై టీబీ యూనిట్ సూపర్‌వైజర్ అరుణ్‌కుమార్ వివరించారు. వ్యాధిగ్రస్తుల పోషణకు ప్రతినెలా ఉచిత మందులు అందించడంతో పాటు రూ.500 వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారులు ఖరీముల్లా, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరీదేవి జయంతి



నందవరంలో చౌడేశ్వరీదేవికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్, ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

కొలిమిగుండ్ల: తొగట వీర క్షత్రియుల ఆరాధ్యదైవమైన చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలను సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కోటపాడు, నందిపాడు, కొలిమిగుండ్లలోని చౌడేశ్వరిదేవి ఆలయాల్లో ఉదయమే అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తొగటవీర క్షత్రియులతో పాటు గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కోటపాడు, నందిపాడు గ్రామాల్లో అమ్మవారి జయంతిని పురస్కరించుకొని భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశి, గుంజలపాడు, భీమునిపాడు, వెలగటూరు, బిజనవేముల, తదితర గ్రామాల్లో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీ మాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరీ మాతకు ఉదయం అభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. హెచ్ కొట్టాలలో చౌడేశ్వరీ మాత ఆలయంలో జరిగిన పూజలకు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి హాజరయ్యారు. అలాగే బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ, బైటిపేట గాడుబావి వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం చౌడేశ్వరీ మాత ఉత్సవమూర్తిని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు.



కోటపాడులో ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి

ఆపదలో అండగా..



వికలాంగుడితో వేలి ముద్రలు సేకరిస్తున్న వలంటీర్ సునీల్‌కుమార్‌రెడ్డి

ఈ చిత్రంలో వికలాంగుడితో వేలుముద్రలు తీసుకుంటున్న వ్యక్తి బనగానపల్లె పట్టణంలోని కొండపేటకు చెందిన 15వ వార్డు వలంటీర్ కె.సునీల్‌కుమార్‌రెడ్డి. ఎంబీఏ పూర్తి చేసిన కె.సునీల్‌కుమార్‌రెడ్డి సేవాభావంతో రూ.5 వేలకే వలంటీర్‌గా విధులు నిర్వర్తిన్నాడు. కరోనా సమయంలో పింఛన్లతో పాటు నిత్యవసర సరుకులను కూడా పంపిణీ చేశాడు. అప్పట్లో తన పరిధిలోని ప్రజలతో మంచి సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. బయటకు వెళ్లలేని వారికి ఏ అవసరమొచ్చినా తాను న్నానంటూ ప్రత్యక్షమయ్యేవాడు.

– బనగానపల్లె



ఎవరూ లేని నాకు వలంటీరే దిక్కు..

తల్లిదండ్రులు లేని నాకు వలంటీర్ సునీల్‌కుమారే దిక్కయ్యాడు. నెలనెలా పింఛన్ అందజేయడంతో పాటు ఏ అవసరం వచ్చినా సాయ పడుతున్నాడు. కరోనా సమయంలో అయితే ఆయన సేవలు మరువలేనివి.

– ఆకుల శ్రీరాములు, కొండపేట, బనగానపల్లె

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



కునుకుంట్లలో వైద్య సేవలనందిస్తున్న డాక్టర్ వినోద్ కుమార్

అవుకు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. సోమవారం కునుకుంట్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ తన సిబ్బందితో కలిసి గ్రామంలోని 81 మంది సాధారణ వాధిగ్రస్తులకు, నలుగురు గర్భిణులకు, ఐదుగురు బాలింతలకు, రక్తపోటు ఉన్న 14 మందికి, డయాబెటీస్ ఉన్న 10 మందికి, మంచానికి పరిమితమైన ఇద్దరికి చికిత్సలు చేసి మందులు అందజేశారు. గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు రక్త హీనత నివారణకు తీసుకోవాల్సిన మందులను, ప్రభుత్వం నుంచి వారికి అందే సంక్షేమాలను, వారు వేయించుకోవాల్సిన టీకాలను, ఆహార నియమాలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కమాల్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్: స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ శిశువు ఆరోగ్యంపై మాత్రమే వివరాలు ఇవ్వాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని భ్రూణ హత్యల నివారణ కమిటీ చైర్మన్, ఆర్డీఓ వెంకటరెడ్డి హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం కమిటీ మెంబర్లతో కలిసి స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో ఏయే పరీక్షలు నిర్వహిస్తారో నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే లైసెన్సులను రద్దు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కమిటీ మెంబర్లు సహాయ జిల్లా వైద్య ఆరోగ్యాధికారి మల్లికార్జునరెడ్డి, అడ్వకేట్ మధుసూదనరెడ్డి, సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనుల పరిశీలన

డోన్: మండలంలోని గుండాల చెన్నకేశవస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.5 కోట్లతో ప్రహరీ, గర్భగుడి నిర్మాణం పనులను దేవదాయ, ధర్మదాయ శాఖకు చెందిన శిల్పులు ఇప్పటికే పూర్తిచేయగా, రాజగోపురం నిర్మాణం పనులను స్తపతిలు మొదలుపెట్టారు. ఈ పనులను రాష్ట్ర ఆర్థిక మంత్రి ఓఎస్డీ ప్రతాప్‌రెడ్డి సోమవారం పరిశీలించారు.

కలెక్టరుకు వినతి

డోన్ టౌన్: తాము సాగు చేసుకుంటున్న భూమిని చెరువులో కలపొద్దని మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామ దళితు రైతులు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వే నంబరు 300ను చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా చెరువులో కలుపుతుండటంతో సాగులో ఉన్న పలువురు దళిత రైతులు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోటా రాముడు, దళిత హక్కుల పోరాట సమితి ప్రభాకర్, ఏఐటీయూసీ నాయకుడు అబ్బాస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు.

బీమా వర్తింపజేయాలి

డోన్ టౌన్: రైతులు సాగు చేసిన ప్రతి పంటకు బీమా వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన నంద్యాల డీసీసీ కార్యదర్శి జనార్దన్, ప్యాపిలి మండల అధ్యక్షుడు సుబ్బు యాదవ్ తదితరులతో కలిసి ఆర్డీఓ వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

నూతన కమిటీ



కుందూనది పరిక్షణ సమితి నూతన కమిటీ

కోవెలకుంట్ల: స్థానిక శివాలయ ఆధ్యాత్మిక కేంద్రంలో కుందూనది పరిరక్షణ సమితి నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుందూనది పరివాహక సమితి కన్వీనర్ కామని వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మానవ హక్కుల సంఘం నాయకులు కరీంబాషా, వెంకట్, కోశాధికారిగా రాజు, మీడియా సెక్రటరీగా బందెల ఓబులేసు, ఉపాధ్యక్షులుగా లింగన్న, గడ్డం అమర్‌నాథరెడ్డి, గుర్రప్ప, బాలపుల్లయ్య, సహాయ కార్యదర్శులుగా అప్పపోగు వెంకటసుబ్బయ్య, వడ్డె సుబ్బరాయుడు, సీతారాం, నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు

డోన్ టౌన్: మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామ సమీపంలో వెలసిన బంగారుకొండ పాతపాలెం అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసం అమావాస్యను పురస్కరించుకుని స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, ఆకు పూజలు, తులసీమాలలతో మంగళ హారతులు ఇచ్చారు. హైదరాబాదు, మహారాష్ట్ర, పూణే తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

పశువుల కృత్రిమ గర్భధారణ నమోదులో డోన్‌కు మొదటి స్థానం

డోన్: పశువులకు కృత్రిమ గర్భధారణ సూదులు వేసే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమంలో డోన్ ప్రాంతీయ వైద్యశాలకు జిల్లాలోనే ప్రథమ స్థానం దక్కిందని పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ నాగరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత ఏప్రిల్ 23 నుంచి జూన్ 23వ తేదీ వరకు 462 కృత్రిమ గర్భధారణ కేసులు నమోదు లక్ష్యం సాధించాల్సి ఉండగా.. 476 కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో ప్రథమ స్థానం దక్కిందన్నారు. పశువైద్యులు, పారా సిబ్బంది, గోపాలమిత్ర, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ల కృషితోనే సాధ్యమైందన్నారు.

అర్థమయ్యేలా బోధించాలి

అవుకు: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం పట్టణ సమీపంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంఈఓ శ్రీధర్‌రావుతో కలిసి సందర్శించారు. పాఠశాలలో మౌలిక వసతులపై ఎంపీపీ ఆరా తీశారు. ఐదు రోజులుగా ఆదర్శ పాఠశాలలో నీటి సమస్య నెలకొందని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరిముల్లా, ఈఓ అశ్విన్ కుమార్‌లను పాఠశాలకు పిలిపించి, సమస్యను వివరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తెలుగు రామప్ప, ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, కేజీబీవీ ఎస్‌ఓ భారతీ పాల్గొన్నారు.

23న జిల్లా కేంద్రంలో ర్యాలీ

ప్యాపిలి: తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ర్యాలీ కి వాల్మీకులు తరలిరావాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి(ఎంవీఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు పులికొండన్న, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులు తెలిపారు. సోమవారం వాల్మీకి సంఘం సమావేశంలో వారు మాట్లాడారు.

పింఛన్ పెంచాలి

బనగానపల్లె రూరల్: డప్పు, చర్మ కళాకారులకు రూ.3వేల పింఛన్‌ను రూ.10 వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ నాయకులు .. డీటీ కిశోర్‌కుమార్ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం



గోర్లగుట్టలో సీసీ రోడ్డు పనులపై చర్చిస్తున్న ఎంపీపీ

బేతంచెర్ల: గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. సోమవారం గోర్లగుట్ట గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో కొనసాగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ మురుగు కాల్వ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. హెచ్‌కొట్టాల గ్రామం వద్ద నిర్మిస్తున్న వాల్మీకి భవన నిర్మాణ పనులను వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీతో కలిసి ఎంపీపీ పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదక్క, వార్డు మెంబర్ వెంకిరెడ్డి, వైఎస్సార్ నాయకులు నాగరాజు, బాలవెంకటరెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దీక్షలను జయప్రదం చేయండి

డోన్ టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20, 21 తేదీలలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి, మండల అధ్యక్షులు శివరాం, రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాయలం ఆవరణంలో సోమవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తూ సహకరించాలని కోరారు.

మెట్టుపల్లెలో ఫీవర్ సర్వే

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామంలో ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సోమవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబంలోని సభ్యుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైందని, దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. దోమ కాటు నుంచి రక్షించుకునేందుకు దోమ తెరలు వాడాలని, ఎవరైనా జ్వరాల భారిన పడితే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కమాల్‌సాహెబ్, ఏఎన్‌ఎం ఎల్లమ్మ, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



సర్వేయర్లతో తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది

ప్యాపిలి: బదిలీ అయిన మండల పరిధిలోని సచివాలయాల సర్వేయర్లు మురళి, బాలకృష్ణ, రేణుక, చిట్టిలను తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, ఎక్కడికెళ్లినా బాగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ మారుతి, మండల సర్వేయర్ నాగరాజు నాయక్, వీఆర్వోలు సోమశేఖర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

డోన్ టౌన్: మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో మద్యం విక్రయిస్తున్న బెలగంటి పాండురంగడును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నిందితుని ఇంటి వద్ద కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విక్సీ 90ఎంఎల్ 20 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి పేకముక్కలు, రూ.21,250 నగదు స్వాధీనం చేసుకుని పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్కా బీటర్ అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ శివశంకర్ నాయక్ సోమవారం తెలిపారు. రాంబాబును అరెస్ట్ చేసి, మట్కా చీటీలతోపాటు, రూ.1,500 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై వేధింపులు

బేతంచెర్ల: పట్టణంలోని సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన మహిళను కాపురం విషయంలో భర్తతోపాటు మరో నలుగురు వేధింపులకు గురిచేస్తున్నారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపిన వివరాలు.. సయ్యద్ చాంద్‌బీతో వైఎస్సార్ కడప జిల్లా మైదుకూర్‌కు చెందిన సయ్యద్ చాంద్‌బాషాతో ఏడాది క్రితం వివాహమైంది. కొంత కాలంగా భర్త సయ్యద్ చాంద్‌బాషాతో పాటు మరో నలుగురు కాపురం విషయంలో వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో అప్పు విషయంలో అన్నదమ్ములు ఉడుముల పాడు శివ, రాంబాబు మధ్య ఘర్షణ పడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివశంకర్‌నాయక్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.